క్లుప్తంగా

26న హుండీ లెక్కింపు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ హనుమాన్ ఆలయం హుండీని ఈ నెల 26న ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈవో మారుతి తెలిపారు.

ట్రైబల్ డిగ్రీ కాలేజీలో లెన్స్‌సైట్ వర్క్‌షాప్



లెన్స్‌ల గురించి వివరిస్తున్న అధ్యాపకులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో గురువారం లెన్స్‌సైట్ వర్క్‌షాప్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రజిని తెలిపారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ శాఖ హెచ్ఓడీ డి.రఘుధామస్, అధ్యాపకులు భాస్కర్‌రాజు, సురేశ్ వివిధ రకాల లెన్సుల గురించి వివరించి ఫొటోగ్రఫీ మెలకువలు తెలియజేశారు. ఫిజిక్స్ శాఖ హెచ్ఓడీ కె.వాణిశ్రీ ఫొటోగ్రఫీ విధానంలో కాంతి పరిక్షేపన గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ సిద్ధోగానికి రండి



జెడ్పీటీసీ మంజుల లింగారెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో జరిగే ఎల్లమ్మ సిద్ధోగానికి రావాలని జెడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దంపతులను సన్మానించి అమ్మవారి పసుపు, కుంకుమతోపాటు ఆహ్వానపత్రిక అందజేశారు.

ఇంటింటా పథకాలు వివరించాలి



మాట్లాడుతున్న గౌస్

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం జరిగిందని, సంక్షేమ పథకాలపై కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిపేటలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున పథకాలపై విస్తృత ప్రచారం చేసి పార్టీ అభ్యర్థులు గెలిచేలా ఓట్లు అభ్యర్థించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఎన్నికలు ముగిసేవరకు ప్రతీ కార్యకర్త అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే అభ్యర్థుల గెలుపునకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



సోనికి బీమా ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్‌లో పనిచేసే ప్రతీ కార్యకర్తకు ఆపద సమయంలో అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని తెలంగాణ భవన్ ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు ఎడ్ల సందీప్, సీనియర్ నాయకుడు పందిర్ల పర్శరాములుగౌడ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పెంటం కుమార్ 45 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. పార్టీ నుంచి ప్రమాదబీమా పథకం ద్వారా మంజూరైన రూ.2 లక్షల ప్రొసీడింగ్ కాపీలను గురువారం మృతుడి భార్య పెంటం సోనికి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్యకర్తల కుటుంబాలు ఆపదలో ఉంటే ఆదుకుంటామని పేర్కొన్నారు. బీమా డబ్బుల కోసం కృషి చేసిన ఎమ్మెల్యే కేటీఆర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చందనం శివరామకృష్ణ, మహమ్మద్ సల్మాన్, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్లు నిర్మించండి

బోయినపల్లి: మండలంలోని నీలోజిపల్లి, కొదురుపాక, వెంకట్రావుపల్లి గ్రామాల్లో బస్సులు ఆగే స్థలాల్లో షెల్టర్లు ఏర్పాటు చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు కొనుకటి హరీశ్ అధికారులను కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ, వేసవి కాలంలో వాహనాల కోసం వేచి ఉండేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి షెల్టర్లు నిర్మించాలని కోరారు.

బూజుపట్టిన కల్యాణ కట్ట



వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి తడి బట్టలతో కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుంటారు. దీంతో ఏటా కోట్లాది రూపాయల ఆదాయం రాజన్న ఖాతాకు జమ అవుతుంది. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా.. కల్యాణకట్టలో మాత్రం సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కనీసం పారిశుధ్యం సక్రమంగా లేకపోవడంతో భక్తులు మండి పడుతున్నారు. స్లాబ్ నిండా బూజు పేరుకుపోయి అపరిశుభ్రంగా కనిపిస్తుంది. అలాగే కల్యాణకట్టలోకి చేరుకోవాలంటే అడుగుతీసి అడుగు జాగ్రత్తగా వేయకుంటే జారిపోవడం ఖాయమని భక్తులు పేర్కొంటున్నారు. ఆలయ అధికారులు స్పందించి కల్యాణకట్టలో సౌకర్యాలు పెంచాలని భక్తులు కోరుతున్నారు.

అదుపుతప్పితే అంతే



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట–వీర్నపల్లి ప్రధాన రహదారిపై పాత బావి ప్రమాదకరంగా మారింది. బావిని పూడ్చివేయాలని ప్రయాణికులు పలుసార్లు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలయ్యాయి. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో చీకట్లో ఈ ప్రాంతంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఉపాధి పథకంలో బావిని పూడ్చివేయాలని అధికారులు ప్రతిపాదనలు చేసినా ఆచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి బావిని పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో బెల్ట్ షాపుపై గురువారం రాత్రి పోలీసులు దాడి చేశారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, కోనరావుపేట ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కుంట వెంకటి, బోయిని నాగరాజుల బెల్ట్‌షాపులపై దాడి చేసి రూ.9వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తు న్న ఇద్దరి ఇండ్లలో మద్యం విక్రయిస్తుండగా గు రువారం పట్టుకున్నామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలి పారు. ఈడుగురాళ్ల రామచంద్రం ఇంట్లో రూ.20వేల విలువైన మద్యం, కొమిరె ఎల్లం ఇంట్లో రూ.10వేల మద్యం పట్టుకుని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంకా అద్దె భవనాల్లోనే..

- ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు కరువు
- ఒక్కో ఆఫీస్ ఒక్కోచోట ఉండడంతో జనం అవస్థలు



అద్దె భవనంలో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయం

వేములవాడ: రాష్ట్రం సిద్ధించి పదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పలు చోట్ల సర్కార్ ఆఫీసులకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్నారు. దీంతో ప్రజాధనం వృథాతో పాటు ప్రజలకు కష్టంగా మారుతోంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోటికి తీసుకొచ్చి ప్రజలకు సౌకర్యవంతంగా చేయాలన్న ఆలోచన లేకపోవడం శోచనీయమంటూ సీనియర్ సిటిజన్లు పేర్కొంటున్నారు. వేములవాడ మండల పరిషత్ ఆవరణలో సరైన ప్రణాళికలు లేకుండా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడంతో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుందని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 7.5 ఎకరాల్లో ఉన్న సదరు భూమిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించుకునే అవకాశం ఉంది. అయినా గత, ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదు. పక్కా భవనాల నిర్మాణానికి ఆయా శాఖలు నిధులు కేటాయించినా ఇంకా పనులు ప్రారంభించడం లేదు.

అద్దె ఇండ్లలోనే ఆఫీసులు

వేములవాడ పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సర్కార్‌కు ఆదాయం తెచ్చిపెట్టే సదరు కార్యాలయాలను పని నిమిత్తం వెతుక్కోవడం ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. ఆదాయానికి ప్రధాన వనరు అయిన రిజిస్ట్రేషన్ కార్యాలయం అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ కార్యాలయం కూరగాయల మార్కెట్ పరిధిలో, ఐసీడీఎస్ చెక్కపల్లి రోడ్డులోని అద్దె భవనంలో, పోస్టాఫీసులు భగవంతరావునగర్‌లో కొనసాగుతున్నాయి. వీటితోపాటు ప్రభుత్వ హాస్టళ్లు సొంత భవనాలు లేక అద్దె ఇళ్లలోనే కొనసాగుతున్నాయి.



అద్దె ఇంటిలోనే ఎక్సైజ్ కార్యాలయం

పాలకులు చొరవ తీసుకోవాలి



సొంత భవనాలు నిర్మించుకునేందుకు మండల పరిషత్ ఆవరణలో సరిపడా స్థలం ఉంది. పలు శాఖల కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు నిధులు కూడా విడుదల చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కానీ, పాలకులు పట్టించుకోవడం లేదు. వెంటనే మండల పరిషత్ ఆవరణలో అన్ని కార్యాలయాలు నిర్మించాలి. పాలకులు కాస్త ప్రజల అవసరాలను గుర్తించి వారికి అందుబాటులో పాలన ఉండేలా చొరవ తీసుకోవాలి.

– ఎస్.కృష్ణారెడ్డి, వేములవాడ

ఆఫీసులన్నీ ఒకేచోట ఉండాలి



ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉంటే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఒక్కో ఆఫీసు ఒక్కో చోట ఉంటే ప్రజలు ఎలా పనులు నిర్వహించుకుంటారు. మండల పరిషత్ ఆవరణను మినీ కలెక్టరేట్‌గా మార్చుకునే అవకాశం ఉంది. కానీ, ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు నిర్మాణాలు చేపట్టి ప్రజలను అవస్థలపాలుజేయడం సరికాదు. మండల పరిషత్ ఆవరణలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టారో జనం గమనిస్తున్నారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించాలే తప్ప అవస్థల పాలు చేయొద్దు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

– బింగి శ్రీనివాస్, వేములవాడ

పెంచిన వేతనాలు అమలు చేయాలి



మున్సిపల్ కమిషనర్ లావణ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

సిరిసిల్లటౌన్: చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఈమేరకు గురువారం సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం పెంచిన రూ.1,000 అందిస్తూ.. ఎండాకాలంలో ఒకపూట పనిదినం అమలు చేయాలన్నారు. 2009 నుంచి 2012 వరకు 118 మంది కార్మికుల పీఎఫ్ డబ్బులు ఖాతాల్లో జమచేయాలని, ఆరు నెలల పెరిగిన ఏరియర్స్ వేతనాలు రావాల్సి ఉందన్నారు. ఐడీ కార్డులు, కార్మికులకు కావాల్సిన సబ్బులు, నూనెలు, బట్టలు, చెప్పులు, ఇతర సామగ్రి అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో సుల్తాన్ నర్సయ్య, గడ్డం భారతమ్మ, కాసర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



పెద్దలింగాపూర్‌లో ఎండిన పంటలను పరిశీలిస్తున్న రసమయి బాలకిషన్

తంగళ్లపల్లి: సాగునీరు అందక, వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. గురువారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పంటల నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల రెక్కల కష్టం నేలపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన పంటలను సర్వేచేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్క గంట కూడా కరెంట్ పోలేదని కానీ, కాంగ్రెస్ 100 రోజుల పాలనలోనే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అనంతరం పెద్దలింగాపూర్, రామోజీపేట గ్రామాల్లో అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మరమ్మతు చేయక.. దాహార్తి తీరక



మరిమడ్లలోని జాలాగుకుంట

- పశువులు, వన్యప్రాణులకు ప్రధాన నీటివనరు జాలాగుకుంట
- మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు తెగిన చెరువు కట్ట
- మరమ్మతు చేయని అధికారులు
- నీటికోసం అల్లాడుతున్న జీవాలు

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల, చుట్టుపక్కల అటవీ ప్రాంతాల్లోని పశువులు, గొర్లు, మేకలు, వణ్యప్రాణులకు తాగునీటిని అందించే జాలాగుకుంట కట్ట తెగిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో చెరువు కట్ట మరమ్మతుకు నోచుకోవడం లేదు.

ప్రధాన నీటి వనరు

కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామ శివారులోని అటవీప్రాంతంలో జాలాగుకుంట కొన్నేళ్ల క్రితం నుంచి ఉంది. అటవీప్రాంతంలో ఉండడంతో వన్య ప్రాణులు, పశువులు, గొర్లు, మేకలకు ప్రధాన నీటి వనరు. జీవాలన్నీ ఇక్కడకు వచ్చి దాహార్తిని తీర్చుకునేవి. ప్రస్తుతం జీవాలకు అందుబాటులో నీరు లేకుండాపోయింది.




తెగిపోయిన కుంట కట్ట

పట్టింపు కరువు

మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు జాలాగుకుంట కట్ట తెగిపోయింది. దీంతో చెరువులోని నీరంతా వృథాగా పోయింది. సమీప అటవీ ప్రాంతంలోంచి కొద్దికొద్దిగా నీరు వస్తున్నా చెరువులో నిలవడం లేదు. కట్ట తెగిపోవడంతో ఉన్న కొద్దిపాటి నీరంతా బయటకు వెళ్లిపోతోంది.


జీవాలకు ఇబ్బంది..



మాకు గొర్లు, మేకలు ఉన్నాయి. వాటిని మేపుకుంటూ బతుకుతాం. అటవీ ప్రాంతంలోని జాలాగుకుంటలో నీరు ఉన్నప్పుడు గొర్లు, మేకలను నీటి కోసం అక్కడికి తీసుకెళ్లేది. ఇతర ప్రాణులు కూడా నీటి కోసం అక్కడికే వచ్చేవి. కుంట కట్ట తెగిపోవడంతో నీరు ఉండడంలేదు. దీంతో జీవాలకు నీటి ఇబ్బందులు తప్పడం లేదు.

– తొట్ల పెద్ద లచ్చయ్య, గొర్లకాపరి, మరిమడ్ల

మరమ్మతు చేపట్టాలి



జాలాగుకుంట అన్ని రకాల వణ్యప్రాణులు, జీవాలకు ప్రధాన నీటివనరుగా ఉండేది. చెరువు కట్ట తెగిపోయినప్పటి నుంచి జీవాలకు, పశువులకు తాగునీరు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలి. వన్యప్రాణుల దాహార్తి తీర్చాలి.

– కుమ్మరి దిలీప్‌కుమార్, మరిమడ్ల

పరబ్రహ్మమూర్తి మరణం తీరని లోటు



పరబ్రహ్మమూర్తి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతగా అనేక మంది విద్యార్థులను విద్యావంతులను చేసిన పరబ్రహ్మమూర్తి మరణం విద్యాశాఖకు తీరని లోటని ఉపాధ్యాయులు అన్నారు. కుసుమరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, 30 ఏళ్ల పాటు విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా, సిరిసిల్లలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేశారని, గురువారం ఉదయం 3 గంటలకు గుండెపోటుతో మరణించారని పలువురు కన్నీరుకార్చారు. సుదీర్ఘకాలంలో సిరిసిల్లలో పని చేసి ఇటీవలే కరీంనగర్ జిల్లాలోని దుర్శేడ్‌కు బదిలీపై వెళ్లగా వారం క్రితం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. అందరితో కలిసిమెలిసి పని చేసి జిల్లాలో అత్యధిక విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేసిన ఘనతను అందుకున్న ప్రధానోపాధ్యాయుడి మరణం తీరని లోటుగా అభివర్ణించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మల్లారపు పురుషోత్తం, ఉపాధ్యాయులు పాకాల శంకర్‌గౌడ్, రవీందర్, కుమ్మరి మల్లేశం, గోవిందరావు, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశం, సమ్మయ్య, సంధ్యారాణి ఆయన సేవలను కొనియాడుతూ నివాళి అర్పించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి: చిరుధాన్యాలతో బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనుకవ్వ అన్నారు. మండలంలోని మూడపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలింతలు ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, రాధిక, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సబిత, వినోద తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



లాల్‌సింగ్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న రోజా

వీర్నపల్లి: మండలంలోని లాల్‌సింగ్‌తండా గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సఖి కోఆర్డినేటర్ రోజా పాల్గొని మాట్లాడారు. పోషణ్ పక్వాడ్‌లో భాగంగా ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. సామలు, కొర్రలు, అరికెలు, జొన్న, సజ్జ, రాగి తదితర పోషకాలపై ప్రచారం చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

దాల్‌ఉల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ దాన గుణం గొప్పది

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



ముస్లింలకు కిట్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ కళ, తోట ఆగయ్య తదితరులు

సిరిసిల్లటౌన్: నిరుపేద ముస్లింల చేయూతకు కృషి చేస్తున్న దాల్‌ఉల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ దాన గుణం గొప్పదని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. రంజాన్ సందర్భంగా గురువారం సొసైటీ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు నిత్యావసరాలు, కొత్తబట్టల కిట్లను అందజేసి మాట్లాడారు. అల్లా చూపిన మార్గంలో సొసైటీ ప్రతినిధులు నిరుపేదల పట్ల చూపుతున్న సేవాభావాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కౌన్సిలర్ ఆకుల కృష్ణ, సొసైటీ నిర్వాహకులు బాబా, కవ్వంపల్లి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



లింగంపేటలో శిబిరాన్ని పరిశీలిస్తున్న పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి కొమురయ్య

చందుర్తి: గాలికుంటు వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కొమురయ్య పేర్కొన్నారు. మండలంలోని లింగంపేటలో పశువైద్య శిబిరాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమతో ఆర్థికంగా బలపడుతున్న రైతులు నష్టపోకుండా ఉండేందుకు పశువులకు టీకాలు వేయించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు పశువులకు టీకాలు వేస్తామని, జిల్లాలో గాలికుంట వ్యాధి నివారణ టీకా కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందన్నారు. గ్రామంలోని 150 పశువులకు టీకాలు వేశారు. మండల పశు వైద్యాధికారి నితిన్‌కుమార్, పశు వైద్య సహాయకులు మౌనిక, గోపాల మిత్రులు అజయ్, రాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి

వీర్నపల్లి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. కార్మికుల సమస్యలు పదేళ్లుగా పరిష్కారం కావడం లేదన్నారు. ఏప్రిల్ 2న సిరిసిల్లలో భవన నిర్మాణ కార్మికుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, కార్మికులు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాయకులు మల్లారపు దేవయ్య, మల్లారపు అరుణ్‌కుమార్, గుంటుకు నరేందర్, కటుకురి రాజు, భూస రాజం, కార్మికులు చంద్రయ్య, శంకర్, అంజయ్య, రాజం, కృష్ణ, శోభన్, వీరయ్య పాల్గొన్నారు.